# పుష్పలావిక

- తమిరిశ జానకి

పూలమొక్కలకి నీళ్ళు పోస్తూ ప్రతి మొక్కతోనూ తీయగా ప్రేమగా ఊసులాడుతోంది గౌరి.

ఆమె కబుర్లకి పరవశిస్తున్నట్టు....

ఆమె స్పర్శకి పులకిస్తున్నట్టు... అటూ ఇటూ ఊగుతూ ఆనందం వెలిబుచ్చుతున్నాయి ఆ మొక్కలు.

ఎన్ని మొక్కలు?.... ఎన్నిరకాల పూలమొక్కలు!.....

ఆ మొక్కల్లో తానూ ఓ మొక్కలా... ఆ రెమ్మల్లో తానూ ఓ రెమ్మలా...

ఆ ఆకుల్లో తానూ ఓ ఆకులా... ఆ పూలల్లో తానూ ఓ పువ్వులా

ఆ తోటలో... తాను స్వయంగా వేసి పెంచుతున్న ఆ చిన్ని తోటలో తిరుగాడుతోంది గౌరి.

"పిన్నమ్మ!" పరిగెత్తు కొచ్చాడు రంగడు.

"ఏవిరా?" వాడిని ప్రేమగా దగ్గరకి తీసుకుంది.

సన్నజాజి అల్లుకుపోయినట్టు వాడి లేత లేత చేతులు పిన్నమ్మని చుట్టేశాయి.

"ఈ రోజు బళ్ళో కొత్త పంతులొచ్చారు. నీకు చెప్పడం మరిచా...."

"అట్లనా?" వాడి తృప్తి కోసం ఎక్కడలేని ఆశ్చర్యం కళ్ళల్లో.

"కొత్త పాఠం నేర్పించినారా?"

"ఓ...." కళ్ళుపై కెగరవేశాడు.

"నువ్వు బాగా చదూకుని పెద్ద ఉద్యోగం చేసెయ్యాల. ఈ పిన్నమ్మకున్న కోరిక అదొక్కటేరా"

"ఓ... చేస్తా...."

"మాబాబే.... మాబాబే..." ముద్దులతో వాడిని ముంచెత్తింది.

ఆతోటలోని పూలపరిమళాలన్నీ తీసికట్టే ఆమె ముద్దుల్లోని ఆప్యాయత అనేసుగంధానికి.

ఆ పూబాలల సోయగాలు వెలవెలబోయాలు ఆనందం తృప్తి వెల్లివిరుస్తున్న ఆమె కన్నుల తళుకులముందు.

తోటి స్నేహితుడెవరో పిలుస్తుంటే రివ్వున తూనీగలా పరిగెత్తిపోయాడు రంగడు.

అప్పుడే వాడు పెద్దవాడై పోయినట్టు పెద్ద చదువులు చదివేసినట్టు ఊహిచేసుకుంటూ మళ్ళీ మొక్కల సంరక్షణలో పడిపోయింది గౌరి. అక్క మనసులో మెదిలి కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

"ఏంటే అక్కా! ఈ సారి మరీ దిగాలు పడిపోయున్నావ్! నీ దిగులేంటో నాతో చెప్పకూడదా?" ఊర్నించి వొచ్చిన అక్కని అడగకుండా ఉండలేకపోయింది ఆ రోజు.

చిన్నగా నిట్టూర్చి గౌరివంక తిరిగింది నూకాలు.

"నీతో చెప్తే నన్నా నాకు కొంత ఊరటగా ఉంటదేమో! కానీ అయ్యతో మాత్రం చెప్పమాకు. ఇప్పటికాయన పడుతున్న తిప్పలు చాలు"

"చెప్పను" హామీ ఇచ్చింది గౌరి.

"మీ బావ మంచోడుకాదే. ఈ భూమ్మీద ఎన్ని చెడ్డగుణాలున్నయ్యో అన్నీ ఉన్నయ్ ఆడికి, దానికే నేను బాధపడి చస్తా ఉంటే... ఇప్పుడు... ఈ పిల్లగాడు పుట్టిన కాడినించీ నన్నింకా రాచిరంపాన పెడుతుండె. ఈ బతుకేవొద్దనిపిస్తా ఉందినాకు".

అక్క ఒళ్ళో ఉన్న పసిపిల్లాడి మీద అప్రయత్నంగా ఆపేక్షగా చెయ్యి వేసింది గౌరి. "ఏంటక్కా నువ్వనేది? అసలేం జరిగింది?"

పెళ్ళయిన కాడినించీ అక్క సుకపడ్డది లేదు.

ఎప్పుడూ తన్నులు తిని పుట్టింటికి రావడవేగా...

"మీ అయ్యనడిగిడబ్బుట్రా" ఎప్పుడూ ఇదే పాట ఆ కట్టుకున్నోడి నోటెంట. ఆడి జల్సాలకి ఎంత డబ్బని చాల్తది? అయ్య జమీందారా? అడిగినప్పుడల్లా డబ్బు రాసులు గుమ్మరించేందుకు?

తనపెళ్ళి చెయ్యాలని... పాపం... అయ్య నాలుగు డబ్బులు కూడ బెడతాఉంటే అల్లుడు తన్నుకుపోతుండె... కాదంటే పెద్ద కూతురి బతుకు నాశనం అవుతాదయ్యె... నోరు కుట్టుకుని కూచోవలిసొచ్చె అయ్యకి, అతగాడి బాగోతంతో తన పెళ్ళి యెనకబడిపోయె... తనేం చిన్న పిల్లనా?.... పాతికేళ్ళొచ్చేసినయ్...

"ఈ పిల్లగాడు తనకిపుట్టిన కొడుకు కాదంట... అబాండం ఏశాడునాపైన... అనుమానం పెంచేసుకుని రోజూ గొడ్డుని బాదినట్టు బాదతాడు నన్ను. ఇంక తిట్టే ఆ తిట్లు నానోటితో నేను చెప్పలేనే..."

తుళ్ళిపడింది గౌరి అక్క మాటలకి.

ఆ సీతామహాతల్లి నిజంగా ఉందో లేదో తనకైతే తెలియదుగానీ తన కన్నెదుట కనిపించే సీతమ్మతల్లి తన అక్కే. అటువంటి అక్క మీద అనుమానవా?

మొదటి రెండు తడవలూ పుట్టిన బిడ్డలు దక్కకుండా చావు తప్పి కన్నులొట్ట బోయినట్టయింది అక్కకి. మనశ్శాంతి లేని బతుకు. ఎప్పుడూ తోటకూర కాడల్లేవాడిపోయి వేలాడిపోటవే... పెళ్ళయిన ఇన్నేళ్ళకి అపురూపంగా నిలిచిన బిడ్డ వీడు. డబ్బుతేతెమ్మని రొస్టు పెట్టేది చాలక ఇప్పుడీ కొత్త హిమ్సు మొదలెట్టాడన్నమాట.

ఏడుపొచ్చింది గౌరికి,

తన ఏడుపు నొక్కి పట్టుకుని అక్కకి ఓదార్పు మాటలు చెప్పడానికి ప్రయత్నించింది తన శాయశక్తులా.

"ఆడిచేత రోజూ తిట్లూ చావుదెబ్బలూ తినే బదులు ఒక్కసారి ఏదో గుటుక్కున మింగిచస్తే వొదిలిపోతది"

"అక్కా... వొద్దక్కా.... అట్టాంటి మాటలనమాకు. బావ మంచిగా మారతాడులే. ఆ ఆశతోనే బతుకుదాం."

ఏడవలేక నవ్వింది నూకాలు

కల్మషంలేని మనసు...

కళ్ళల్లో నీళ్ళు... పెదాలమీద చిరునవ్వు...

అక్కని చూస్తుంటే మంచులో తడిసిన మల్లెమొగ్గ కంటిముందు నిలిచింది గౌరికి.

పక్కనే ముల్లుగుచ్చుకుంటున్నా తన బాధపైకి తెలియనీయకుండా నవ్వులు చిందిస్తూ విచ్చుకున్న గులాబి బాల గుండెల్లో కదిలింది. మరి కొద్దిరోజుల్లో వినకూడని వార్త వినాల్సి వొచ్చింది. నూకాలు ఆత్మహత్య చేసుకుంది.

గుండెలు బాదుకుంటూ పడిపోయింది గౌరి. పొరుగూరికి తండ్రితో కలిసి హోరున కురిసే వానలో బయల్దేరింది.

పదినెల్ల పసివాడిని చీదరించుకుంటూ కాలితో తంతున్న బావని చూసిందా ఇంట్లో అడుగు పెడుతూనే. అతనో రాక్షసుడిలా కనిపించాడామె కంటికి. ఒక్క పరుగున వెళ్ళి పిల్లాడిని చేతుల్లోకి తీసుకుని గుండెల కదుముకుంది. "ఓ సోస్... నీకెందుకూ ఆడి మీదంత ప్రేమ? నువ్వుకన్నావా?" వెకిలిగా నవ్వాడు రావులు.

బావ మొహమ్మీద తుపుక్కున ఉమ్మెయ్యాలనిపించింది గౌరికి.

"పరాయమ్మ బిడ్డయినా పసిపిల్లాడంటే ఎవ్వురికైనా జాలుంటది... అట్టాంటప్పుడు నా అక్క బిడ్డమీద నాకు ప్రేమవుండదా?"

"అబ్బో! మాటలు నేర్చిన కుక్క ఇస్కో అంటే ఇస్కో అందిట. అంత ప్రేమైతే ఆడిని నీతో తీసుకుపో. మళ్ళీ ఎప్పుడూ ఆడి మొహం నాక్కనపడకుండా ఉంటే బతికిపోతాడు. లేపోతే ఎప్పుడో నాసేతి దెబ్బల్లోనే గుటుక్కుమంటాడు."

కన్నకొడుకుని అట్టాంటి మాటలనడానికి నోరెలా వొచ్చిందో? ఈడు మనిషి కాదు??...

కళ్ళనీళ్ళు పెట్టుకుంది గౌరి. అంతే... ఆక్షణంనించీ ఆ పిల్లాడు గౌరిబిడ్డే అయ్యాడు. తన ఊరు తీసుకొచ్చింది. ఈ పిల్లాడి కోసవే ఈ పిన్నమ్మ బతికేది అనుకుంది.

పెళ్ళి చేసుకోవాలన్న ఆలోచనే మనసులోకి రానివ్వలేదు. ఆ మాటే తలపెట్టనివ్వలేదు తండ్రిని.

!+!+!+!

"ఇదుగో చూడూ.. నువ్వుపోయి ఆ పిల్లగాడిని తీసుకొచ్చి మనింటో పెట్టేసినావంటే మంచిది మనకి" అధికారపూర్వకంగా అంది వరాలు.

నూకాలు పోయిన కొద్ది రోజుల్లోనే వరాల్ని చేసుకున్నాడు రావులు. నూకాలు లాగా అమాయకురాలు మెత్తని మనిషీ కాదు ఈ వరాలని గ్రహించడాని కాట్టే రోజులు పట్టలేదు రావులికి. చాలా గయ్యాళిది వరాలు. అడుగు తీసి అడుగేస్తే తాటకిలా విరుచుకుపడుతుంది. పులిలాంటి రావులు పిల్లిలా మారిపోవడం గమనిస్తూనే ఉన్నార్రు. ఆ పేటలో అంతా, పెళ్ళయిన నాలుగేళ్ళకి కూతురు పుట్టింది. వరహాలు ఆరోగ్యం అంతంత మాత్రమే అయింది. తల్లిప్రాణం దక్కాలంటే మరి పిల్లలు పుట్టకుండా ఆపరేషన్ చెయ్యక తప్పదన్నారు. దాంతో మొగ నలుసు లేకపోయెనే అన్న దిగులు ఇద్దరికీ మొదలైంది. పిల్లకిప్పుడు ఏడాది.

లాభనష్టాలు బేరీజు వేసుకుని ఈ రోజు వరాలు రంగడి గురించి మాట్లాడింది.

"ఏ పిల్లగాడూ నువ్వు చెప్పేది?" అర్థమైనా అర్థం కానట్టు దీర్ఘం తీశాడు రావులు.

"ఏ పిల్లోడినో నేనెందుకు తీసుకురమ్మంటా? నీ పిల్లోడే... రంగడు... ఆళ్ళ పిన్నమ్మ దగ్గిరే పెరుగుతున్నాడంటగా?

"ఔను"

"ఆరేళ్ళంటగా ఇప్పుడు?"

"ఔను"

"ఇంకొక్కఏడాది పోతే ఆ పిల్లోడిని ఏదో ఓపన్లో ఎట్టేసి ఆ డబ్బు యెనకేసుకుంటది ఆడి పిన్నమ్మ. ఆ డబ్బు దానికెందుకు పోనివ్వాల? ఆడిని మనింటికే తెచ్చుకుంటే ఇంటో చాకిరీకి పనికొస్తాడు ఏదన్నా పన్లో జేరి నాలుగు డబ్బులు సంపాయించి నీ చేతిలో పెట్టడానికి పనికొస్తాడు. ఇంక మనకి మళ్ళీ పిల్లలు పుట్టే అదురుష్టం లేకపోయే. వాడుంటే రేపు నీకు కాలూ చెయ్యీ ఆడనప్పుడు ఇల్లు నడిపేందుకు ఆసరా అవుతాడుగా మనకి".

వరాలు మాటలు సబబుగానే తోచాయి రావులికి. ఈమద్దెనరోజూ కడపులో నెప్పొస్తూనే ఉండె తనకి. తాగుడెక్కువై పోటం వల్ల అని తెల్సు. కానీ మానలేదు. ఓ రోజు పన్లోకి యెళ్ళినా యెళ్ళలేకపోయినా మొగపిల్లోడుంటే చిన్న చిన్న కూలిపనుల్లో పెట్టేయచ్చు. చేతికింద ఆసరాగా ఉంటాడు. నూకాలు మీద మోజు తీరిపోయి అప్పట్లో ఆడు నాకు పుట్టినోడు కాదని దాన్ని కాల్చుకుతినేవోడు తను. అంతేగానీ ఆడు తన కొడుకు కాపోటవా?

"నువ్వు చెప్పేదీ బానే ఉంది... కానీ... మరి... ఎళ్ళడిగితే నాతో పంపిస్తదా ఆడి పిన్నమ్మ?"

గయ్యిమని లేచింది వరాలు "ఏం? ఎలా కాదంటది? నీ పిల్లోడిని నువ్వు తీసుకు పోతానంటే దాని అదారిటి ఏవిటంటమద్దెన?"

"నిజవేననుకో..."

"ఇంకా అనుకునేదేంటి? చేతికింద ఆసరాగా పన్లకి ఆడిని తెచ్చుకోక పిచ్చిమొకవల్లే కూచుందావనా? బయల్దేరిపో"

"అట్టా నించున్న పళంగా తెమ్మంటే అదేవన్నా చెక్క బొమ్మంటే? ఉపాయవాలోచించుకోవాలమరి"

"ఏవో మరి.. అదేదో తొందరగా చూడు" ఆలోచన వచ్చిందే తడవు ఆత్రంవరాలుకి. తలూపి ఆలోచనలో పడ్డాడు రావులు.

ఆమర్నాడే రంగంలోకి దిగాడు. పొరుగూరు బయల్దేరాడు. అది మొదలు అప్పుడప్పుడు పొరుగూరెళ్ళి పిల్లగాడు చదూతున్న బడి దగ్గిర కాపుకాసి ఆడిని నెమ్మది నెమ్మదిగా మాలిమి చేసుకునే పన్లో పడిపోయినాడు.

!+!+!

"గౌరీ"

"వొస్తున్నా అయ్యా" మల్లెమొగ్గలు కోస్తున్న గౌరి గుడిసెలోపలి కొచ్చింది.

జ్వరంతో నాలుగైదు రోజులుగా కూలిపనికి పోడమే లేదు శివయ్య.

తాగేందుకు నీళ్ళియ్యమని పిలిచాడనుకుంది గౌరి.

కానీ... అక్కడ... అయ్యకెదురుగా కూచునున్న ఆకారం చూస్తూనే తుళ్ళిపడింది... పైగా... అతగాడి ఒళ్ళో రంగడు.

"బావొచ్చినాడే"

అయ్య గొంతులో ఆ సంబరం ఎందుకో తెలియదు.

"గౌరీ" బావ పిలుపు కంపరం పుట్టించింది.

ఏవిటన్నట్టు చూసింది.

"పిల్లోడిని ఇంకనాకాడనే అట్టి పెట్టుకుందావని... కూడా తీసుకు పోదావని వొచ్చినా"

గుడిసె కుప్పకూలి దానికింద తనుపడినట్టనిపించింది గౌరికి. గుండె ఆగిపోయిందనే అనిపించింది ఒక్క నిమిషం. పిచ్చిదానిలా చూసింది.

"ఏరానాతో పట్నం వొచ్చేస్తవుగా? అక్కడ నీకు మిఠాయిలూ బొమ్మలూ ఏం కావాల్నంటే అవి రోజూ కొనిపెడతా.... నిన్ను మురిపెంగా చూసుకుంటా, మీ అయ్యని కదా..."

"ఓ... నీతో వొస్తానయ్యా..." కళ్ళు చక్రాల్లా తిప్పాడు రంగడు.

"నీ పిల్లోడు... నీఇష్టవు... నువ్వు తీస్కపోతానంటే కాదంటానికి మేమెవురం?" తన అభిప్రాయం చెప్పేశాడు శివయ్య.

"ఏంటయ్యా? నువ్వుకూడా అట్లంటావ్... పిల్లోడు నాపేణవే గదా... ఆడులేకుండ ఈ గౌరి బతుకేవిటికి?"

"తప్పుదుగదేమరి... ఆళ్ళ పిల్లోడిని ఆళ్ళు తీస్కపోతానంటే అందులో తప్పేవి?"

తప్పుందని గట్టిగా అరవాలనిపించింది గౌరికి.

"యిాల్లేదయ్యా... పిల్లోడిని నేనుకనలేదు గానీ అంతకంటే ఎక్కవగానే పేణంలా పెంచుకొస్తన్నాను. బళ్ళో ఏశాను. పెద్ద పెద్ద చదువులు చదివి పెద్ద ఆఫీసరవ్వాలి ఆడు. ఆడి కోసమే సంపాయిస్తున్నాను. ఆడికోసవే బతుకుతున్నా. ఆ బతుక్కోసవే ఇంత తిండి తింటన్నాను. పూలమ్మి బతుకుతున్నా. పువ్వులా ఆడిని చూసుకుంటన్నా"

"ఓసోస్... పెద్ద పెద్ద మాటలొస్తన్నాయే? ఆడికి అయ్యన్నేను. నాకుండదా ఆడిమీద ప్రేవ?"

"ఆ... ఉందిలే మాలావుప్రేవ... కల్లబొల్లికబుర్లు చెప్పమాకు"

"గౌరీ నువ్వుండహే..." విసుక్కుంటూ రావులివైపు చూశాడు శివయ్య.

"రావులూ... దాంతో నీకేవిలే... దాని మాట పట్టించుకోమాకు.

తీస్కపో నీ పిల్లాడిని... నీకొడుకు నీ ఇష్టవు"

గర్వంగా ఓనవ్వు విసిరాడు రావులు గౌరివంక చూస్తూ.

లేచినిలబడి కొడుకు చేతిని గట్టిగా పట్టుకున్నాడు.

"ఏరా! ఎవురో వొచ్చి తీసకపోతానంటే ఈ పిన్నమ్మ నొదిలేసి పోతావంట్రా?" ఒక్క ఉదుటున రంగడి ముందుకి వెళ్ళి మోకాళ్ళ మీద కూచుంది.

"ఎవురో కాదు పిన్నమ్మా... మా అయ్యే...."

రంగడి జవాబు పదునైన కత్తిలా గౌరి గుండెల్లో దిగింది.

మొక్కకి నొప్పి పెట్టకుండా ఆకులు దూయటం తెలుసు గౌరికి...

సున్నితంగా మొగ్గలు తుంచటం తెలుసు గౌరికి...

నాజూకుగా మాలలు అల్లటం తెలుసు....

పరాచికాలు ఆడుతూ పూలమ్మటం తెలుసు

కానీ.... కానీ.... తన స్వార్థంతో ఎంత తెలివిగా రావులు పిల్లాడిని రహస్యంగా మచ్చిక చేసుకున్నాడన్నది మాత్రం తెలియదు గౌరికి.

★☆★☆★